సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి
● జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్

సిద్దిపేట రూరల్, ఆగస్టు 8: ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్ అన్నారు. గురువారం సిద్దిపేటరూరల్ మండలం ఇర్కోడులో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఆదర్శపాఠశాలలో నిర్వహించారు. గ్రామంలో ర్యాలీగా వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామస్థులకు, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. కలిషితమైన నీరు తాగడం వల్ల డయేరియా, అతిసార వ్యాధి, వాంతులు, విరోచనాలు అవుతాయని తెలిపారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. దోమల వల్ల మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలు లాంటివి వచ్చే అవకాశం ఉందని, వాటి నుంచి మనల్ని మనం రక్షించుకోవాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో గాజు పెంకులు, కొబ్బరిబోండాలు, పగిలిన కుండల్లో, వాడి పడవేసిన కూలర్, టైర్లలో, పూల కుండీల్లో, పనికిరాని వస్తువుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. జ్వర పీడితులకు తక్షణమే రక్త నమూనాలను సేకరించి తగు చికిత్స అందించాలని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశామని, ప్రజలకు వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పనితీరును మెరుగుపరచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతి, పీవో డాక్టర్ వినోద్ బాబ్జి, ఎంపీడీవో మురళీధరశర్మ, ఎంపీవో శ్రీనివాస్‌రావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాపురెడ్డి, ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, హెచ్‌ఈ పాండురంగచారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలకు సీజనల్ వ్యాధుల గురించి వివరిస్తున్న డీఎంహెచ్‌వో, సిబ్బంది

సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో
అదనంగా సీటీ స్కాన్, ఎంఆర్ఐ

మంత్రి దామోదర్ రాజనర్సింహ

సమస్యలు, వసతుల కల్పనపై మంత్రి దృష్టికి తీసుకెళ్లిన జగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 8 : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అదనంగా సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరికరం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కాలేజీని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి గురువారం ఆయన సందర్శించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం మరో సీటీ స్కాన్‌తో పాటు ఎంఆర్ఐ పరికరం అవసరమని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విన్నవించగా సానుకూలంగా స్పందించిన మంత్రి.. మంజూరు చేస్తామని ప్రకటించారు. ఆస్పత్రిలోని ఓపీ, ఫార్మసీ, ల్యాబ్, డయాలసిస్, టీ-డయాగ్నోస్టిక్‌హబ్‌తో పాటు ఎంసీహెచ్‌లోని నవజాతశిశు సంరక్షణ కేంద్రం తదితర వార్డులను పరిశీలించారు. పలువురు రోగులతో ఆప్యాయంగా పలకరించి నాణ్యమైన వైద్య సేవలందించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.


సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

పనుల్లో జాప్యంపై ఆగ్రహం

మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు జాప్యంపై ఆర్‌అండ్‌బీ, కాంట్రాక్టర్‌పై మంత్రి దామోదర్, జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు విడుదల కాకపోవడంతో పనుల్లో ఆలస్యంగా జరుగుతున్నదని కాంట్రాక్టర్ బదులిచ్చారు. దీనిపై స్పందిస్తూ.. ఈ విషయం ఎనిమిది నెలలుగా ఎందుకు తమదృష్టికి తీసుకురాలేదని, అప్పుడే వచ్చి ఉంటే సమస్యకు పరిష్కారం దొరికేదని పేర్కొన్నారు. నాలుగు నెలల్లో అసంపూర్తి భవనాల నిర్మాణ పనులు పూర్తిచేసి మెడికోలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా రెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి, ఆర్డీవో వసంతకుమారి, డీఎంఈ డా.వాణి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్, జీఎంసీ ప్రిన్సిపాల్ డా.సుధామాధురి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, డీసీహెచ్ఎస్ డా.సంగారెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఈఈ రవీందర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ రాంబాబు, అధికారులు, వైద్య సిబ్బంది, మెడికోలు పాల్గొన్నారు.

లెక్క తేలేనా..

ఇటీవలి కాలంలో శునకాల దాడులు మితిమీరడంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. కుక్కలను నియంత్రించే చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 315 జీవో ద్వారా పలు కీలకమైన సూచనలు చేసింది. పల్లెలు, పట్టణాల్లో యానిమల్ బర్త్ కంట్రోల్ కమిటీలను ఏర్పాటు చేసి.. వీరి ద్వారా కుక్కల సంఖ్యను తేల్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సంఖ్య ఆధారంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయనున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో అక్కడక్కడా ఈ సర్వే ప్రారంభమైంది.



శునకాల లెక్కింపునకు సర్వే ● పల్లెలు, పట్టణాల్లో 'ఏబీసీ' కమిటీలు

వీధికుక్కల కట్టడికి కార్యాచరణ ● తూతూమంత్రంగా ముగిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది!

ఉమ్మడి జిల్లాలో 17 మున్సిపాలిటీలు, 1,615 గ్రామాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఆగస్టు 8: ఉమ్మడి జిల్లాలోని సిద్దిపేటలో 499, సంగారెడ్డిలో 647, మెదక్‌లో 469 గ్రామాలున్నాయి. అదేవిధంగా సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్, సంగారెడ్డి, అందోలు-జోగిపేట, నారాయణఖేడ్, జహీరాబాద్, సదాశివపేట, అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం, మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట మున్సిపాలిటీలు ఉన్నాయి. శునకాలను లెక్క తేల్చడానికి మున్సిపాలిటీ, మండల, గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. దీని ప్రకారం మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ ఆఫీసర్లు, గ్రామపంచాయతీల కార్యదర్శులు, వెటర్నరీ డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, జంతు ప్రేమికులు, మహిళా సంఘాల ప్రతినిధులకు కమిటీల్లో భాగస్వామ్యం కల్పించాల్సి ఉంది. వీరంతా ఒక కమిటీగా ఏర్పాటై గ్రామాలు, పట్టణాలవారీగా శునకాల లెక్క తేల్చి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. ఆడ, మగ జాతుల కుక్కలతోపాటు క్రూరత్వంగా ఉండే కుక్కలను సైతం గుర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏబీసీ కమిటీలుగా పేర్కొనే ఈ కమిటీలపైనే పూర్తి బాధ్యత ఈ కమిటీలకే ఉంటుంది.


సిద్దిపేటలోని వీధుల్లో తిరుగుతున్న శునకాలు

మొక్కుబడిగా లెక్కింపు

ఇప్పటికే కొన్నిచోట్ల కుక్కలను లెక్కించే కార్యక్రమం మొదలైంది. అయితే నిబంధనల ప్రకారం ఈ లెక్కింపు సాగడం లేదనే విమర్శలున్నాయి. జిల్లాస్థాయి అధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన గంటల్లోనే కొంత మంది కార్యదర్శులు, సిబ్బంది తమ పరిధిలోని శునకాల సంఖ్యను చెప్పడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇలాగైతే సర్వేతో ప్రయోజనం ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జీవోలో సూచించిన మార్గదర్శకాల ప్రకారం సర్వే చేయడం వల్లనే ఫలితం ఉంటుందని చెబుతున్నారు. కానీ కొంతమంది అధికారులు బాధ్యతతో కాకుండా భారంగా ఈ సర్వేను భావిస్తున్నారు. ఆడ, మగ, క్రూరమైన.. ఇలా వర్గాలవారీగా కుక్కలను గుర్తించాలంటే అనేక ఇబ్బందులు ఉండడంతో ఇష్టారీతిగా లెక్కలు అప్పగించేందుకు కూడా అవకాశముందనే విమర్శలున్నాయి. శునకాల లెక్కింపును తూతూమంత్రంగా కాకుండా శాస్త్రీయంగా నిర్వహిస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరుతుందని ఓ జిల్లాస్థాయి అధికారి పేర్కొన్నారు.


సిద్దిపేటలోని కోమటిచెరువు నెక్లెస్ రోడ్డుపై..

బర్త్ కంట్రోల్ సాధ్యమేనా?

కుక్కల సంఖ్యను నియంత్రించడానికే ప్రభుత్వం ఈ సర్వేను చేపట్టినట్లుగా తెలుస్తోంది. అయితే ఒక కుక్కకు కుటుంబ నియంత్రణ సర్జరీ చేయాలంటే రూ.1,600 పైచిలుకు ఖర్చు అవుతుందని అంచనా. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా కందిలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. గతంలో సిద్దిపేటలో కూడా సెంటర్‌ను నిర్వహించినా ఆ తర్వాత నిలిపివేశారు. స్వచ్ఛంద సంస్థలకు ఈ సెంటర్ల బాధ్యతలను అప్పగించగా.. వారి సిబ్బందే కుక్కలను బంధించడం నుంచి వాటికి ఆపరేషన్ చేసి పంపించే వరకు పర్యవేక్షిస్తారు. దీనిని నిరంతరంగా కొనసాగిస్తేనే ఫలితం ఉండే అవకాశం ఉంటుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 50వేలకు పైగా కుక్కలు ఉన్నట్లు అంచనా. వీటన్నింటికి బర్త్‌కంట్రోల్ ఆపరేషన్ చేయించడం సాధ్యమయ్యే పనేనా అనే అనుమానాలున్నా.. చిత్తశుద్ధితో పనిచేస్తేనే సాకారం చేయొచ్చనే వాదన ఉంది.

పిల్లల విద్యాసామర్థ్యాలపై సర్వే

● ములుగు మండలంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ దర్శన ఆధ్వర్యంలో పరిశీలన

ములుగు, ఆగస్టు 8: పిల్లలోని విద్యాసామర్థ్యాలను తెలుసుకునేందుకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ) గురువారం ములుగు మండలంలో సర్వే నిర్వహించింది. న్యూఢిల్లీకి చెందిన ఐఆర్డీఎన్‌సీఈఆర్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దర్శన బీజీ ఆధ్వర్యంలో ములుగు మండలం బండమైలారం, కొత్తూరు, తునికి బొల్లారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పాఠశాలల్లో బృందం సభ్యులు సర్వే చేపట్టారు. ప్రతీ మూడేళ్లకోసారి జాతీయ సాధన సర్వే (ఎన్ఏఎస్) ప్రభుత్వ బడుల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడవ తరగతి పిల్లల నుంచి పరిగణలోకి తీసుకొని మౌలిక వసతులు, పిల్లల ప్రగతి, విద్యాబోధన తదితర అంశాలపై పరిశీలన చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 జిల్లాలు ఎంపిక చేయగా, సిద్దిపేట జిల్లాలో ములుగు మండలం ఎంపిక చేసి సర్వే నిర్వహిస్తున్నారు. పాఠశాల ప్రారంభం నుంచి ముగిసే వరకు సర్వే బృందం సభ్యులు బడులను పర్యవేక్షించారు. విద్యార్థులు నిత్యం పాఠశాలకు వస్తున్నారా? పనివేళకు ముందే ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పాఠశాల ఆవరణలో స్వచ్ఛత, తరగతి గది నిర్వహణ, బోధనోపకరణాలతో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పే విధానం, పిల్లల అల్లరి అరికట్టడంలో తీసుకుంటున్న ప్రత్యేకతలు, మధ్యాహ్న భోజన వంట, వడ్డించడం, పరిశుభ్రత, భోజనం చేసే తీరు, మౌలిక వసతులు పరిశీలన చేశారు. తల్లిదండ్రులు, పాఠశాల, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు, డీఈవో పలువురి నుంచి అభిప్రాయాలు సేకరించారు.


ములుగులో సర్వే చేస్తున్న ఎన్సీఈఆర్టీ బృందం

బ్యాంక్‌ను తనిఖీ చేసిన ఆర్ఎం

రాయపోల్ : రాయపోల్‌లోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ)ను రీజినల్ మేనేజర్ వికృష్ణమోహన్, చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్ ఆజాద్ గురువారం తనిఖీ చేసి బ్యాంకు రికార్డులు పరిశీలించారు. ఖాతాదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్ఎం మాట్లాడుతూ బ్యాంకు సేవలను మరింత విస్తరింప చేస్తామని పేర్కొన్నారు. రాయపోల్‌లో ఏటీఎంను అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఆర్ఎంను బ్రాంచ్ మేనేజర్ సుమన్ బాగే, రామారం మాజీ సర్పంచ్ మంజరి హన్మంత్ సన్మానించారు.

మల్లన్నసాగర్‌లోకి
గోదావరి జలాలు

తొగుట మండలం తుక్కాపూర్ శివారులో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి గురువారం గోదావరి నీటి ఎత్తి పోతలను ఇరిగేషన్ అధికారులు ప్రారంభించారు. ఇందులో 8.55 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 4 బాహుబలి పంపుల ద్వారా నాలుగు రోజుల పాటు రెండు టీఎంసీల నీటిని ఎత్తి పోయనున్నట్లు మల్లన్నసాగర్ డీఈ చెన్ను శ్రీనివాస్ తెలిపారు.

– తొగుట, ఆగస్టు 8



మహిళకు బీమా

● స్వయం సహాయక గ్రూపులకు అమలు
● సంఘాల మహిళలందరికీ వర్తించేలా ప్రభుత్వం నిర్ణయం
● 60 ఏళ్లలోపు సభ్యులందరికీ వర్తింపు

సిద్దిపేట అగ్రికల్చర్, ఆగస్టు 8 : గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమైక్య సంఘాల మహిళలకు ఆర్థిక చేయూతనిస్తూ.. వారిని అన్నిరంగాల్లో చైతన్యపర్చేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. చిరు వ్యాపారులు, వాహనాల కొనుగోళ్లు, వ్యవసాయం, వైద్యం తదితర అవసరాలకు స్త్రీనిధి రుణాలు రుణాలు అందిస్తున్నారు. రుణాలు పొందిన వారికి సైతం సురక్ష బీమాను వర్తింపజేస్తున్నారు. తీసుకున్న లోన్‌కు బీమా వర్తింపజేసేవారు. ఏ కారణం చేతనైనా రుణగ్రస్తురాలు మరణిస్తే లోన్ మొత్తం మాఫీ అయ్యేది. తద్వారా కుటుంబీకులపై ఆర్థిక భారం ఉండేది కాదు. అయితే రుణం తీసుకున్న వారికే బీమా వర్తింపజేసేవారు. ప్రస్తుతం లోన్‌తో సంబంధం లేకుండా సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌లోని సభ్యులందరికీ సురక్ష బీమా అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సభ్యులందరికీ సాధారణ, ప్రమాద మరణాలకు రుణబీమా, ప్రమాద బీమా పథకాలకు సర్కార్ శ్రీకారం చుట్టింది. సంఘ సభ్యులు ఎలా మరణించినా వారి కుటుంబాలకు బీమా పరిహారం అందుతుంది.

జిల్లాలో 18,267 మహిళా సంఘాలు

జిల్లాలో 726 మహిళా గ్రామీణ సమైక్య సంఘాలు ఉన్నాయి. అందులో 18,267 మహిళా సంఘాలున్నాయి. 1,94,210 మంది మహిళా సభ్యులున్నారు. వీరందరికీ ఇప్పుడు సురక్ష బీమా వర్తించనున్నది. డీఆర్డీఏ అధికారులు, సిబ్బంది బీమా పాలసీ విధి విధానాలు, ఇతర అంశాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులకు ప్రభుత్వం లోన్ బీమా, ప్రమాద బీమా పథకాలను అమల్లోకి తెచ్చింది. ఈ పథకాలకు 60 ఏళ్ల లోపు (14-03-2024 వరకు) ఎస్‌హెచ్‌జీల సభ్యులు అర్హులు. సభ్యురాలి వయస్సును ఆధార్ కార్డు/ఓటరు ఐడీలపై ఉన్న దాని ప్రకారం ఏదో ఒకటి లెక్కిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం బీమాకు సంబంధించిన నిబంధనల ఉత్తర్వులను జారీ చేసింది.


మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రమాద బీమా..

ప్రమాదవశాత్తు సభ్యురాలు చనిపోతే ఈ పథకం వర్తిస్తుంది. ప్రమాదవశాత్తు చనిపోయినట్టు నిర్ధారణైతే రూ. 10 లక్షల బీమా అందుతుంది. పోలీస్ ఎఫ్ఐఆర్ కాపీ, మెడికల్ ధ్రువీకరణ పత్రాలను గ్రామ సంఘం ట్యాబ్ ద్వారా, సెర్ప్, మెప్మా సిబ్బంది ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే సభ్యురాలి కుటుంబానికి రూ. 10లక్షలు అందుతాయి. సభ్యురాలు అంగవైకల్యానికి గురైతే రూ.5లక్షల పరిహారం ఇస్తారు. స్వయం సహాయక సంఘంలోని సభ్యురాలు రుణం తీసుకుని ఏ కారణంతో మరణించినా గరిష్ఠంగా రూ.2లక్షల బీమా చెల్లిస్తారు. తీసుకున్న రుణం తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు.

స్త్రీ నిధి, సురక్ష బీమా పథకం..

ఈ పథకం కాల పరిమితి మూడేళ్లు. సభ్యురాలికి సమ్మతమైతేనే ఇందులో చేరొచ్చు. ఏడాదికి రూ.230 చొప్పున మూడేళ్లకు రూ.690 ప్రీమియం చెల్లించాలి. ప్రీమియం చెల్లించేందుకు స్త్రీ నిధి కింద ప్రత్యేక రుణం కూడా తీసుకోవచ్చు. ఈ రుణాన్ని నెలవారీ వాయిదాల్లో చెల్లిస్తే సరిపోతుంది. ఈ బీమా పథకంలో చేరిన సభ్యురాలు మరణిస్తే రూ.2లక్షల బీమా వస్తుంది.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రస్తుతం ప్రతీ ఒక్కరికి జీవిత బీమా తప్పనిసరి. బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రమాదవశాత్తు చనిపోయినట్టుతే రూ. 10 లక్షల బీమా కుటుంబానికి అందుతుంది. సభ్యురాలు రుణం తీసుకుని ఏ కారణంతో మరణించినా గరిష్ఠంగా రూ.2 లక్షల బీమా చెల్లిస్తారు. తీసుకున్న రుణం తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇప్పటికే స్త్రీనిధి బీమా పథకం తక్కువ ప్రీమియంతో మూడేళ్లపాటు బీమా అవకాశం కల్పిస్తోంది. నూతనంగా మరో రెండు బీమా పథకాలు అందుబాటులోకి వచ్చాయి. వీటితో మహిళలకు సహజ, ప్రమాద మరణాలకు బీమా వర్తిస్తుంది. దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

– జయదేవ్ ఆర్య,
జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్స్

కోహెడ/హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 8 : ఓపెన్ స్కూల్‌లో పదోతరగతి, ఇంటర్మీడియట్ చదవాలనుకునే వారి కోసం 2024 సంవత్సరానికి గాను ఈనెల 8 నుంచి అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమయ్యాయని కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కో ఆర్డినేటర్ మహమ్మద్ మహమూద్, హుస్నాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కోఆర్డినేటర్ వాసుదేవరెడ్డి తెలిపారు. ఈ అడ్మిషన్ ప్రక్రియ సెప్టెంబర్ 10 వతేది వరకు కొనసాగుతుందని స్పష్టంచేశారు. మరిన్ని వివరాలకు కోహెడ 9490769005, హుస్నాబాద్‌రూరల్ 9490297977 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మిషన్ కాకతీయ ఎయిర్ పైప్‌లైన్ నుంచి
అక్రమంగా నీరు మళ్లింపు


ఎయిర్ పైపుకు బిగించిన మోటార్

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 8: సిద్దిపేట జిల్లా రంగనాయక సాగర్ ప్రాజెక్టు నుంచి రైతులకు సాగునీరు అందించడానికి మిషన్ కాకతీయ పేరిట పైపులను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా రంగనాయక సాగర్ నుంచి సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి కెనాల్‌లోకి నీళ్లు రావడానికి పైప్‌లైన్ వేసి మధ్యలో ఎయిర్ పైపులను బిగించారు. అయితే గ్రామ సమీపంలోని కొంత మంది రైతులు ఎయిర్ పైపులపై ఉన్న కప్పులను తొలగించి నీళ్లను తమ పొలాల్లోకి మరల్చడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పైపులైన్‌పై కప్పును తొలగించి మోటార్లను బిగించి నీళ్లను పొలాలకి మలుపుతున్నట్లు కూడా ఆరోపిస్తున్నారు.

బియ్యం లారీ పట్టివేత

చేర్యాల, ఆగస్టు 8 : మండలంలోని ముస్త్యాల గ్రామ శివారులోని రైస్‌మిల్లు నుంచి బియ్యం లోడుతో వెళుతున్న లారీపై పలువురు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నంగునూరు మండలం రాంపూర్‌లోని శ్రీనిధి పారాబాయిల్డ్ ఇండస్ట్రీస్ వేబిల్ పేరిట మండలంలోని ముస్త్యాల శివారు రేణుకా పారాబాయిల్డ్ ఇండస్ట్రీస్ నుంచి ఖాజీపేట ఎఫ్‌సీఐకి బియ్యం తరలిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. వెంటనే రేణుకా ఇండస్ట్రీస్ వద్దకు చేరుకున్న పోలీసులు లారీని పట్టుకుని స్టేషన్‌కు తరలించి పౌరసరఫరాల శాఖ అధికారికి సమాచారం అందించారు. వారి పరిశీలన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు

గొంతునులిమి వృద్ధురాలి హత్య


అంజమ్మ(ఫైల్)

టేక్మాల్, ఆగస్టు 8 : డబ్బు కోసం వృద్ధురాలిని గొంతు నొక్కి చంపిన సంఘటన మండలంలోని కాదులూరు శివారులో చోటుచేసుకున్నది. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాదులూర్ గ్రామ శివారు ఎల్లమ్మ గుడి సమీపంలోని దత్తాత్రేయ ఆశ్రమం వద్ద ఓబలి అంజమ్మ(70) జీవనం సాగిస్తుంది. వృద్ధురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఇద్దరు కుమారులు మరణించగా కోడలు హైదరాబాద్‌లో జీవిస్తుంది. సాలోజిపల్లిలో ఉంటున్న పెద్ద కూతురు భర్త వేముల రాములు నిత్యం అత్తమ్మ అంజమ్మకు భోజనం తీసుకెళతాడు. రోజులాగే బుధవారం రాత్రి భోజనం తీసుకెళ్లే సరికి అంజమ్మ విగత జీవిగా పడి ఉన్నది. రాములు ఇంట్లో గమనించగా ఓ మూలకు కాదులూరు గ్రామానికి చెందిన నదారి శివకుమార్ కూర్చొని ఉన్నారు. ఇక్కడ ఏం చేస్తున్నావు అని అడిగే సరికి రాములను కర్రతో కొట్టి పారిపోయాడు. వృద్ధురాలి మేడలో గుండ్లు తీసుకుని హత్య చేసినట్లు మెదక్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. హత్యకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నామని అన్నారు. మృతురాలి అల్లుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు.

క్యూఆర్ కోడ్‌తో డబ్బు కాజేశారు

కల్హేర్, ఆగస్టు 8 : క్యూఆర్ కోడ్ పంపితే మీ అకౌంట్‌లో డబ్బు వేస్తామని చెప్పడంతో నమ్మిన వ్యక్తి వారు చెప్పినట్టే చేయగా తన అకౌంట్‌లో నుంచి డబ్బు పోగొట్టుకున్న సంఘటన సిర్గాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హేమ్లానాయక్ తండాలో జరిగింది. సిర్గాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి గురువారం వివరాలను వెల్లడించారు. హేమ్లానాయక్‌తండాకు చెందిన రాథోడ్ కిషన్‌నాయక్ బావమరిదికి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. అంగన్‌వాడీ ఆఫీసు నుంచి ఫోన్ చేస్తున్నాం.. క్యూఆర్ కోడ్ పంపితే నీ భార్యకు రావల్సిన డెలివరీకి సంబంధించిన రూ.1200 పంపుతామని చెప్పారు. అతని వద్ద స్మార్ట్ ఫోన్‌లేకపోవడంతో బావ అయిన రాథోడ్ కిషన్‌నాయక్‌ను సంప్రదించాడు. వారు చెప్పినట్టు ఫోన్ ఆపరేట్ చేశారు. ఇక అంతే కిషన్‌నాయక్ అకౌంట్‌లో నుంచి రూ.43,570 కట్ అయినట్లు గుర్తించారు. వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయడంతో అకౌంట్‌లో మిగిలిన రూ.25,500 ఫ్రీజ్ అయ్యాయి. బాధితుడు కిషన్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

వృద్ధుడికి మాయమాటలు చెప్పి బంగారం చోరీ

● మూడు తులాలు అపహరించిన దుండగులు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 8 : వృద్ధుడికి మాయమాటలు చెప్పి నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన సిద్దిపేటలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్నది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఇల్లెందుల యాదగిరి(70) అప్పడాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం యాదగిరి పట్టణంలోని సుభాష్‌రోడ్‌లో హోటల్లో టీ తాగి తన అప్పడాల దుకాణం వైపు వెళుతుండగా నలుగురు అతడిని అనుసరించారు. నలుగురిలో ఒకరు బండిపై వస్తుండగా ముత్యాల పోచమ్మ గుడి ఎదుట మిగిలిన ముగ్గురు అతడిని ఆపారు. బంగారం వేసుకొని తిరగవద్దు ముందు పోలీసులు పట్టుకుంటున్నారు జరిమానా విధిస్తున్నారని చెప్పి నాటకం ఆడారు. అతడికి ఒక పేపరు ఇచ్చి అందులో బంగారు ఆభరణాలు పెట్టి పంపించారు. ఆ తర్వాత ఈ ముగ్గురు వృద్ధుడి వద్దకు వచ్చి పెద్దాయన నువ్వు బంగారం వేసుకుని వెళ్లకు. పోలీసులు పట్టుకుంటారు అని నమ్మించారు. యాదగిరి చైను, ఉంగరం మొత్తం మూడు తులాల బంగారు ఆభరణాలు ఒక పేపర్లో చుట్టి, ఏమరుపాటుగా రిపించి ఆ దుండగుల వద్ద అప్పటికు ఉన్న గులకరాళ్ల పేపర్‌ను మార్చి ఇచ్చి పంపించారు. యాదగిరి కొద్దిదూరం వెళ్లిన తర్వాత జేబులో నుంచి పేపర్ తీసి చూసేసరికి గులకరాళ్లు ఉండడంతో చోరీ జరిగిందని గ్రహించి వెంటనే టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సత్తా చాటాలి.. జాతీయస్థాయికి ఎదగాలి

● ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి
● నవోదయలో ముగిసిన క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ పోటీలు

వర్గల్, ఆగస్టు 8 : నవోదయ విద్యాలయంలో నిర్వహిస్తున్న క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ క్రీడల్లో విద్యార్థులు సత్తా చాటి జాతీయస్థాయికి ఎదగాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ఆకాంక్షించారు. గురువారం వర్గల్ కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ పోటీల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి నవోదయ విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు ముఖ్యమన్నారు. క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలన్నారు. శరీర ఆరోగ్యాన్ని, మానసిక వికాసాన్ని కలిగించేవి క్రీడలేనన్నారు. దేశంలోని నవోదయ విద్యాలయాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులు అత్యుత్తమస్థాయికి ఎదగడానికి ఎంతో దోహదపడుతున్నయన్నారు. నవోదయ వంటి ప్రతిష్టాత్మక విద్యాలయంలో సీటు సాధించడం విద్యార్థుల అదృష్టమన్నారు. అనంతరం వేడుకలకు వచ్చిన ఎమ్మెల్సీతో పాటు పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శశిధరశర్మ, మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డిని ప్రిన్సిపాల్ రాజేందర్ సన్మానించారు. క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 14, 17, 19 విభాగాల వారీగా 84 క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు ఈ నెల 12, 13 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూర్ జిల్లా నవోదయ విద్యాలయంలో నిర్వహించే రీజయన్ లెవల్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తొమ్మిది జిల్లాల నవోదయ విద్యాలయాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.




నవోదయ అథ్లెటిక్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, జావెలిన్ త్రోలో పాల్గొంటున్న విద్యార్థి

వారంలో 135 సెల్‌ఫోన్ల రికవరీ

● సెల్‌ఫోన్ పోగుట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి
● సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్
● పోలీసు కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళా


రికవరీ చేసిన సెల్‌ఫోన్‌లతో ఎస్పీ రూపేష్, ఏఎస్పీ సంజీవరావు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 8 : వారం వ్యవధిలో 135 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ వెల్లడించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం మొబైల్ రికవరీ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజుల్లో మొబైల్ లేనిదే చిన్న లావాదేవీ కూడా చేయలేమని, విలువైన సమాచారం, బ్యాంకు అకౌంట్లు, పాస్‌వర్డ్ వంటివి మొబైల్‌ఫోన్లలో సేవ్ చేసి పెట్టుకుంటారని తెలిసిన కొందరు సైబర్ నేరగాళ్లు వాటిని దొంగిలిస్తున్నారని తెలిపారు. అందులోని డాటాను ఉపయోగించి సోషల్ మీడియా ద్వారా వివిధ రకాల సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారాన్ని కూడా కోల్పోవడం జరుగుతుందన్నారు. సెల్‌ఫోన్ దొంగతనాల నుంచి విముక్తి కల్పించడానికి సీఈఐఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి వచ్చిందని, దీని ద్వారా మంచి ఫలితాలు రాబడుతున్నామని వెల్లడించారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్నా లేదా దొంగిలించబడినా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో బ్లాక్ చేసి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్‌లను కొనుగోలు చేసినట్లయితే షాప్ యజమాని నుంచి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తక్కువ ధరకు వస్తుందని మొబైల్‌లను కొనుగోలు చేసి మోసాలకు గురికావద్దని సూచించారు. దొంగిలించబడిన ఫోన్ అని తెలిసినా కొనుగోలు చేసినట్లయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. జనవరి నుంచి జూలై వరకు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయబడిన 3,501 దరఖాస్తులలో 1604 ఫోన్లను గుర్తించి, 941 సెల్‌ఫోన్లను బాధితులకు అందించామని తెలిపారు. ఇందులో వారం రోజుల క్రితం ఏర్పాటు చేసిన స్పెషల్ టీం రికవరీ చేసిన 135 సెల్‌ఫోన్లను గురువారం బాధితులకు అందజేశామని ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, అధికారులు పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

బొల్లారంలో పోలీస్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన

జిన్నారం, ఆగస్టు 8 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో పోలీస్‌స్టేషన్ నూతన భవనం కోసం కేటాయించిన స్థలాన్ని ఎస్పీ చెన్నూరి రూపేష్, అదనపు ఎస్పీ సంజీవరావు గురువారం పరిశీలించారు. 248 సర్వే నంబరులోని మోడల్‌స్కూల్ సమీపంలో ఉన్న స్థలాన్ని సందర్శించారు. పట్టణానికి దూరంగా ఉన్న పోలీస్‌స్టేషన్‌ను పట్టణ పరిధిలోకి మార్చాలని గతంలో స్థలాన్ని కేటాయించగా.. నిర్మాణ పనులు చేపట్టేందుకు ఎస్పీ స్థల పరిశీలించారు. భవననిర్మాణం, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ గంగాధర్, ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.

ఆపమంటే.. ఢీ కొట్టాడు!

వాహన తనిఖీల్లో పోలీసుకు గాయాలు

అసలే పోలీసులు.. ఆపై వాహన తనిఖీలు.. పత్రాలు అడుగుతారు.. లేవంటే ఎంత జరిమానా వేస్తారో అన్న ఆందోళన.. ఆ టెన్షన్‌లో తన టీవీఎస్ మోటార్ సైకిల్‌ను వేగంగా పోనిచ్చాడు. తామంటే భయం లేదా..! ఆపకుండా వెళ్తావా..! అంటూ తనిఖీల్లో ఓ కానిస్టేబుల్ అడ్డు రాగా.. అతడిని ఢీ కొట్టాడు. దీంతో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం మెదక్ జిల్లా రామాయంపేట - మెదక్ రహదారిపై జరిగింది.

- రామాయంపేట, ఆగస్టు 8



కాకతీయుల నాటి హనుమాన్ ఆలయంలో

రాతి కలశం చోరీ

మద్దూరు, ఆగస్టు 8 : సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్లలో కాకతీయుల కాలంలో నిర్మించిన హనుమాన్ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు బుధవారం రాత్రి రాతి కలశాన్ని ఎత్తుకెళ్లారు. సుమారు క్వింటాలకుపైగా బరువు ఉన్న రాతి కలశం చోరీకి గురవ్వడం గ్రామంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆలయంలో పనిచేస్తున్న తుమ్మలపల్లి బుచ్చమ్మ రోజూలాగే ఆలయాన్ని శుభ్రం చేసేందుకు గురువారం ఉదయం గుడికి వెళ్లాడు. ఆలయంలో వినాయకుని విగ్రహం ముందున్న రాతి కలశం కన్పించలేదు. చోరీకి గురైనట్లు భావించి మాజీ సర్పంచ్ ఆలేటి రజిత యాదగిరికి సమాచారం అందించారు. ఆయన పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్‌ఐ జగదీశ్వర్, కానిస్టేబుల్ సిద్ధార్థ ఆలయానికి చేరుకున్నారు. చోరీకి గురైన రాతి కలశానికి సంబంధించి వివరాలను గ్రామస్థులను అడిగి సేకరించారు. అతి పురాతనమైన ఆలయాన్ని ప్రభుత్వం దూపదీపనైవేద్యం కింద ఎంపిక చేసినప్పటికీ ఆలయ పూజారి హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. గ్రామస్థులు నిత్యదీపారాధనకు ఒకరిని, ఆలయ శుభ్రతకు మరొకరిని నియమించారు. దొంగతనంపై విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపారు.


వివరాలను సేకరిస్తున్న పోలీసులు, చోరీకి గురైన రాతికలశం

వర్గల్ విద్యాధరి క్షేత్రంలో చోరీకి యత్నం

● ఆలయ మండపం ఎడమవైపు ద్వారం వద్ద తాళం ధ్వంసం
● ముసుగు ధరించిన నలుగురి దుండగుల గుర్తింపు


తాళం పగులగొట్టి తెరిచేందుకు ప్రయత్నించిన తలుపు


వర్గల్, ఆగస్టు 8 : వర్గల్ విద్యాధరి క్షేత్రంలో అర్ధరాత్రి గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని దొంగలు చోరీకి విఫల యత్నం చేశారు. సంఘటనకు సంబంధించి వివరాలు.. మండల కేంద్రంలోని విద్యా సరస్వతీ అమ్మవారి ఆలయం వద్ద అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు లైట్లు ఆఫ్ చేసి, సీసీ కెమెరాల వైర్లను కట్ చేశారు. ఆలయం వెనుక వైపు నుంచి చొరబడిన దొంగలు ఆలయ మండపం ఎడమవైపు ద్వారం తాళాలు పగులగొట్టారు. ద్వారం తెరవడానికి ప్రయత్నిస్తుండగా ఆలయ సెక్యూరిటీ, కమిటీ సభ్యుల అలజడి వినిపించడంతో దొంగలు వారి కత్తిని వదిలేసి పారిపోయారు. ఆలయం వద్ద చోరీ యత్నం జరిగినట్లు గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు, ఆలయ నిర్వాహకులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు దొంగల ఆచూకీ కోసం సీసీ కెమెరాలను పరిశీలించారు. నలుగురు గుర్తుతెలియని దొంగలు ముఖానికి ముసుగు ధరించి చోరీ యత్నానికి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వదిలి వెళ్లిన కత్తి

భక్తుల కల్పవల్లి 'కోటి పడగల నాగమ్మ'

● నేడు గాడిచర్లపల్లిలో నాగుల పంచమి జాతర

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 8 : భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన సిద్దిపేటలోని గాడిచర్లపల్లి వద్ద కొలువై ఉన్న కోటి పడగల సంతాన నాగదేవత ఆలయంలో ప్రతీ ఏటా శ్రావణమాసం నాగుల పంచమి సందర్భంగా జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ వ్యవస్థాపకులు కంకణాల దశరథం స్వామి ఆధ్వర్యంలో జాతర కోసం ఏర్పాట్లు చేశారు. శుక్రవారం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇవ్వనున్నారు. జాతరకు జిల్లాతో పాటు హైదరాబాద్, రాజన్న సిరిసిల్ల, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి అలాగే మహారాష్ట్ర నుంచి భక్తులు తరలిరానున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లి సమీపంలోని నాగదేవత ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.


ఆలయంలో కొలువైన అమ్మవారు

పర్యాటక సంస్థ ఫుడ్ కోర్టులు, రిసార్ట్స్

ప్రైవేటీకరణకు రంగం సిద్ధం..!

హైదరాబాద్, ఆగస్టు 8 : పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందిస్తూ ప్రభుత్వ ఖజానాకు ఏటా కోట్లాది నిధులను సమకూర్చుతున్న పర్యాటక సంస్థ రిసార్ట్స్, ఫుడ్ కోర్టులను ప్రైవేట్‌పరం చేయడానికి రంగం సిద్ధం చేసింది. మొదటగా గోల్కొండ ఇబ్రహీంబాగ్ సమీపంలోని తారామతి బరాదరి ఫుడ్‌కోర్టుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం నెక్లెస్ రోడ్‌లోని నీరా కేఫ్ ప్రైవేట్ వ్యక్తుల హస్తగతం కానుంది. తర్వాత సిద్దిపేటలో కోట్లాది నిధులతో అభివృద్ధి చేసిన కోమటిచెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద పర్యాటకుల కోసం అభివృద్ధి చేసిన లేజర్‌షో, లైట్‌అండ్ మ్యూజికల్ ఫౌంటేన్‌ల నిర్వహణ సంస్థకు ఆర్థిక భారంగా పరిణమించడంతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్వచ్ఛదనం - పచ్చదనం నిరంతర కార్యక్రమం

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

చిన్నశంకరంపేట, ఆగస్టు 8 : స్వచ్ఛదనం-పచ్చదనం నిరంతర కార్యక్రమమని, ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. మండలంలోని గవ్వలపల్లి గ్రామంలో మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం పర్యటించారు. వీధులను పరిశీలించి, సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ఇంటి పరిసరాలు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. సూరారం గ్రామంలో మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్ నీలిమ, మండల ప్రతేకాధికారి వెంకటయ్య పాల్గొని పారిశుధ్య పనులను పరిశీలించి ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఏపీవో లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు నామ్‌పల్లి, ప్రవీణ్, టీఏలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


పాత రోలులో మట్టిని నింపుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

విద్యార్థులు చట్టాలపై అవగాహన ఉండాలి

● మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

కంది, ఆగస్టు 8 : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ అన్నారు. కంది మండలం కాశీపూర్‌లోని కస్తూర్బా గురుకుల బాలికల విద్యాలయంలో గురువారం న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ క్రమశిక్షణతో మెలగాలని, న్యాయ పరిధిలో ఎలా జీవించాలో వివరించారు. గృహహింస, బాల్య వివాహం, వరకట్న నిషేధం, పోక్సో చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఉపాధ్యాయులకు న్యాయ పరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు.


వంటశాలను పరిశీలిస్తున్న రమేష్

నాసిరకం రేషన్ బియ్యంపై ఫిర్యాదు

● స్పందించిన తహసీల్దార్


రేషన్ డీలర్లకు సరఫరా చేసిన నాసిరకం బియ్యం

అల్లాదుర్గం, ఆగస్టు 8 : మండలంలో నాసిరకం రేషన్ బియ్యం సరఫరాపై గురువారం స్థానికులు పౌరసరఫరాల జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. ఆగస్టు నెలకు సంబంధించిన రేషన్ బియ్యం దుమ్ము, దూలి కలిగి ఉండటమే కాకుండా గడ్డల కట్టి ఉన్న బియ్యాన్ని మండలంలోని రేషన్ దుకాణాలకు సరఫరా చేసింది. రేషన్ వినియోగదారులు ఈ బియ్యం సరఫరాపై డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత బియ్యమే కదా అని ఇలాంటి నాణ్యతలేని బియ్యం సరఫరా చేస్తే ఎలా అంటు మండిపడ్డారు. చేసేదేమీలేక కొందరు రేషన్ బియ్యాన్ని తీసుకెళ్లగా, మరికొందరు తిరస్కరించారు. నాసిరకం బియ్యం సరఫరాపై కార్డుదారులు జిల్లా అధికారులకు, స్థానిక తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు గురువారం ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ హుటాహుటిన రేషన్ డీలర్లతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. డీలర్లను అడిగి తెలుసుకొని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌కు తెలిపారు. దీంతో నాసిరకం రేషన్ బియ్యాన్ని తిరిగి గిడ్డంగులకు పంపంచి, నాణ్యమైన బియ్యాన్ని పొందాలని రేషన్ డీలర్లకు తహసీల్దార్ సూచించారు.

మెదక్‌లో 3కే మారథాన్

మెదక్ కల్చరల్, ఆగస్టు 8 : జాతీయ యూత్ ఫెస్టివల్‌ను పురస్కరించుకుని నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్(నాకో) ఆధ్వర్యంలో గురువారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో 3కే మారథాన్ రన్ నిర్వహించారు. యువతను ప్రోత్సహించాలనే ఉదేశంతో 3కే రన్‌తో పాటు క్విజ్, రీల్ మేకింగ్, డ్రామా కాంపిటీషన్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డీఎస్‌ఆర్‌ఏసీ కౌన్సిలర్ కాముని రాజేశ్వర్ మాట్లాడుతూ యువతలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పించడం ఈ మారథాన్ రన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పెళ్లికి ముందు ప్రతీ ఒక్కరు హెచ్‌ఐవీ టెస్టు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో ఈ పరీక్షను ఉచితంగా నిర్వహిస్తామని, ఒకవేళ హెచ్‌ఐవీ సోకినట్టు అయితే వారికి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. 3కే మారథాన్‌లో విజేతగా అర్జున్, రెండో స్థానంలో కేఎస్ మునీంద్ర, మూడో స్థానంలో ముఖేష్ నిలవగా వారికి బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ గోపి, ప్రవీణ్, శ్రీకాంత్. జిల్లా అథ్లెటిక్ సెక్రటరీ మధుసూదన్, అథ్లెటిక్ కోచ్ మౌలానా, డిగ్రీ కాలేజ్ లెక్చరర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మారథాన్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్‌ఆర్‌ఏసీ కౌన్సిలర్ రాజేష్

మొక్కలను నాటుదాం.. పచ్చదనాన్ని పెంచుదాం

మొక్కలను నాటుద్దాం, పచ్చదనాన్ని పెంచుదామని అధికారులు పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా గురువారం గ్రామాల్లో, పట్టణాల్లో పర్యటించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గుంతల్లో నిలిచిన నీళ్లల్లో ఆయిల్‌బాల్స్ వేయించారు. మొక్కలు పంపిణీ చేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



సిద్దిపేట క్రైం: ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో..



సిద్దిపేట టౌన్: పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



గజ్వేల్: పట్టణంలోని మురుగుకాలువలో ఆయిల్ బాల్స్ వేయిస్తున్న మున్సిపల్ చైర్మన్



కుకునూరుపల్లి: వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



చిన్నకోడూరు: గంగాపూర్‌లో పర్యటిస్తున్న జడ్పీ సీఈవో రమేష్, తదితరులు



దౌల్తాబాద్: గాజులపల్లి పాఠశాలలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



దూళిమిట: జాలపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నంగునూరు, ఆగస్టు 8: పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు దేవులపల్లి రాజమౌళి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం నంగునూరు కార్యాలయాల వద్ద పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మికులకు కనీస వసతులతో పాటు ఉద్యోగ భద్రత, మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పిల్లి రవీందర్, ప్రధాన కార్యదర్శి చిట్యాల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

● **చిన్నకోడూరు:** గ్రామ పంచాయతీ సిబ్బంది పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు చిన్నకోడూరు ఎంపీడీవో కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.



కొండపాక: మండల ఐవోసీ కార్యాలయం ఎదుట బైఠాయించిన కార్మికులు

● **కొండపాక:** మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్ నర్సయ్య డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు మండల పరిధిలోని కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను సక్రమంగా నిర్వహించడం లేదు

● **కాంగ్రెస్ సిద్దిపేట నియోజవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్**

సిద్దిపేట టౌన్, ఆగస్టు8: ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మున్సిపల్ పాలకవర్గం, అధికారులు సక్రమంగా నిర్వహించడం లేదని కాంగ్రెస్ సిద్దిపేట నియోజవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆరోపించారు. గురువారం పట్టణంలోని 7వ వార్డులో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వార్డు కౌన్సిలర్ శ్రీదేవిబుచ్చిరెడ్డితో కలిసి పర్యటించారు. ఈ మేరకు వారు మొక్కను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన పథకాలు మున్సిపల్ కౌన్సిల్‌లోని కొందరికి నచ్చడం లేదని, అలాంటప్పుడు వాళ్లు తప్పుకోవాలని హితవుపలికారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ఇప్పటికైనా ప్రభుత్వం చేపడుతున్న పథకాలను విజయవంతంగా నిర్వహించేలా చొరవ చూపాలన్నారు. ఆమె భర్త రాజనర్సు కావాలనే కార్యక్రమాలు జరగకుండా అడ్డుపడుతున్నారని, అలాంటప్పుడు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఉమ్మడి మెదక్ జిల్లా మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దామోదర రాజ నర్సింహ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ముద్దం లక్ష్మి, గోపి కృష్ణ, మంద పాండు, తప్పెట శంకర్, కలీ మొద్దీన్, వహాబ్, అజ్మత్, జనార్దన్, రాజిరెడ్డి, వనజ, సాయిప్రతాప్, సతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న పూజల హరికృష్ణ, ఇమామ్

విద్యుత్ పోల్స్ ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దూరు, ఆగస్టు 8: మద్దూరు మండల కేంద్రానికి చెందిన రైతు సాలేహాహగం విద్యుత్ పోల్స్ కోసం డీడీలు చెల్లించి ఏడాది గడిచినా పోల్స్ చేయడం లేదన్న విషయమై గురువారం ఆంధ్రజ్యోతి పత్రికలో 'విద్యుత్ పోల్ ఏర్పాటుకు ఎదురుచూపులు' అంటూ ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఈ విషయమై ఏఈ సుధీర్‌బాబు మాట్లాడారు. కాంట్రాక్టర్‌తో మహిళా రైతు వ్యవసాయ భూమి వద్ద విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయించి పోల్స్‌కు లైన్ క్లీయర్ చేసి విద్యుత్ మోటారును రన్ చేయించినట్లు తెలిపారు. ఈ విషయమై విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయించిన ఆంధ్రజ్యోతికి మహిళా రైతు కృతజ్ఞతలు తెలిపారు.

'అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి'



సంజయ్‌తో మాట్లాడుతున్న నాయకులు

అక్కన్నపేట, ఆగస్టు 8: హుస్నాబాద్ నియోజకవర్గంలోని పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడంతో పాటు పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంతోపాటు పెండింగ్ పనులను పూర్తిచేయాలని వినతి పత్రం అందజేసి చర్చించారు. అనంతరం ఆయన ఢిల్లీ నుంచి ఫోన్‌లో విలేకరులతో మాట్లాడారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితుల పెండింగ్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరినట్లు చెప్పారు. వివిధ అంశాల గురించి చర్చించారు. సంజయ్‌ని కలిసిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి, కట్కూర్ మాజీ సర్పంచ్ జిల్లెల అశోక్‌రెడ్డి, చందుపట్ల నాగరాజు తదితరులు ఉన్నారు.

ఎస్జీటీ ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

● **ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి**



వినతిపత్రం అందజేస్తున్న ఎస్జీటీలు

గజ్వేల్, ఆగస్టు 8: ఎస్జీటీ ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని, విద్యా వ్యవస్థలో ప్రాథమిక విద్యారంగం అతి ముఖ్యమైనదని ప్రాథమిక పాఠశాలలు పటిష్టంగా ఉంటేనే ఉన్నత విద్య బలోపేతం అవుతుందని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. పీఆర్‌టీయూ గజ్వేల్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఊడెం వేమారెడ్డి, తీగుళ్ల లింగం నిర్వహించిన పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనడానికి గజ్వేల్‌కు వచ్చిన ఎమ్మెల్సీకి ఎస్జీటీ ఉపాధ్యాయులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే 11జీవోలు సవరించి, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులు పదివేలకు పెంచి, బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు కూడా పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులు ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ, గజ్వేల్ మండలశాఖ అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగుళ్ల లింగం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కే నరసింహారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకరాజు, రాష్ట్ర కార్యదర్శులు పి శ్రీనివాసరావు, బి.పోచయ్యగౌడ్, నోరి భాస్కర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నాగరాజు ఉన్నారు.

నేడు మంత్రి పొన్నం పర్యటన

కోహెడ, ఆగస్టు 8: కోహెడ మండలంలో బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేడు పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదిక, అలాగే బస్వాపూర్‌లో మంత్రి పర్యటించి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నారని ఆయన చెప్పారు.

గౌరారం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్‌రెడ్డి

వర్గల్, ఆగస్టు 8: మండలంలోని గౌరారం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా కరుణాకర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు.

మర్కుక్ ఎస్‌గా..

మర్కుక్, ఆగస్టు 8: మర్కుక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా దామోదర్ గురువారం బాధ్యతు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ అనురాధ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

పేకాట ఆడుతున్న నలుగురి అరెస్ట్

మద్దూరు, ఆగస్టు 8: మద్దూరు ఉమ్మడి మండలం కొండాపూర్ హన్మ తండాలో పేకాట ఆడుతున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. తండాలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేయగా నలుగురు పట్టుబడగా, మరో నలుగురు పరారయ్యారు. వారి నుంచి రూ. 13,500 నగదు, సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకుని మద్దూరు పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై కేసునమోదు చేసినట్లు షేక్ మహబూబ్ తెలిపారు. అలాగే మండలంలోని వల్లంపట్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కేసునమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

దూళిమిట్ట, ఆగస్టు 8: మండలంలోని కూటిగల్‌కు చెందిన తుశాల పురం మంగ-మహదేవ్‌ల ప్రథమ కుమారుడు సాయి రోహిత్ గత నెలలో అమెరికాలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. రెండు రోజుల క్రితం మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. రోహిత్ తండ్రి మహదేవ్‌కు ఆయనతో కలిసి చదువుకున్న పదోతరగతి స్నేహితులు గురువారం రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు.

రామంతపూర్‌లో జ్వర సర్వే

మాసాయిపేట: మాసాయిపేట మండలం రామంతపూర్‌తండాల్లో వైద్యాధికారులు జ్వర సర్వే నిర్వహించారు. వైద్య సిబ్బంది ప్రమీల, నవీన ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న గ్రామస్థులు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

'పాడిరైతులకు బిల్లులు చెల్లించాలి'

చేర్యాల, ఆగస్టు 8: పాడిరైతులకు బకాయి బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం కొమురవెల్లి మండలకేంద్రంలో బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు బూరుగోజు నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం పాడిరైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా బిల్లుల చెల్లింపుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సానాది కరుణాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

● **జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి రమాదేవి**



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి

సిద్దిపేట క్రైం, ఆగస్టు 8: సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని, ఈ కార్యక్రమంలో అత్యధిక కేసుల పరిష్కారానికి అధికారులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి రమాదేవి సూచించారు. గురువారం సిద్దిపేట కోర్టు ఆవరణలో జిల్లా పోలీస్ అధికారులతో, ఎక్సైజ్, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు కక్షిదారులకు ఇబ్బంది లేకుండా రాజీమార్గం ద్వారా వారి కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కంబ్లె, డిస్ట్రిక్ రెవెన్యూ ఆఫీసర్ నాగచైతన్య, సిద్దిపేట ఏసీపీ మధు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన ఉండాలి

మిరుదొడ్డి, ఆగస్టు8: ఓటు హక్కుపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అందె జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు అన్నారు. గురువారం మిరుదొడ్డి మండలం అందెలోని స్థానిక పాఠశాలలో మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసచారి, శ్రీధర్‌రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, కనకరాజు, ఇంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఏమైంది?

● **ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి**

గజ్వేల్, ఆగస్టు 8: రైతులకు వానాకాలం ఇవ్వాల్సిన రైతుభరోసా ఏమైందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు వానాకాలం ఇవ్వాల్సిన రైతుబంధు నిధులను రుణమాఫీకి మళ్లించి ఇప్పటివరకు రైతులకు రైతుభరోసా ఇవ్వడం లేదన్నారు. రుణమాఫీ కానీ రైతులు బ్యాంకుల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హల్దీ, కూడవెల్లి వాగుల్లోకి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

'ఉన్నత లక్ష్యం కోసం కష్టపడాలి'



షూస్ పంపిణీ చేస్తున్న దృశ్యం

మద్దూరు, ఆగస్టు 8: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యం కోసం కష్టపడి చదవాలని పాశికంటి లక్ష్మమ్మ రాందాసు మెమోరియల్ ట్రస్టు నిర్వాహకురాలు పాశికంటి వెంకట్‌రమణసుధాకర్ సూచించారు. లద్నూరు ఉన్నత పాఠశాలలో ట్రస్టు సభ్యుడు హరిప్రసాద్ సహకారంతో 25వేల విలువచేసే షూస్‌ను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణవేణి ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కమిటీ ఎన్నిక

చేర్యాల, ఆగస్టు 8: ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా మైసంపల్లి రాహుల్, కార్యదర్శిగా తాడూరి భరత్ ఎన్నికయ్యారు. ఈమేరకు గురువారం స్థానిక వైశ్యభవన్‌లో జరిగిన సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ ప్రకటించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి, నాయకులు రాకేశ్‌రెడ్డి, బండి అరవింద్, గొర్రె మధు, ప్రశాంత్, విక్రం, రాజు, హారిక తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేట క్రైం, ఆగస్టు 8: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ సిబ్బందితో కలిసి కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 23 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొన్నారు. వారిని గురువారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ చేసి 23 మందికి రూ.20,800 జరిమానా విధించారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

● **ఆర్డీవో రామ్మూర్తి**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మూర్తి

అక్కన్నపేట, ఆగస్టు 8: గ్రామాల్లోని అధికారులందరూ సమన్వయంతో క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి సూచించారు. మండలంలోని రైతు వేదికలో గురువారం వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడకుండా ఉండేందుకు గ్రామస్థాయి అధికారులే ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. గ్రామస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వారు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తారని పేర్కొన్నారు. మండల కేంద్రంలో అద్దె భవనాల్లో నడిచే ప్రభుత్వ కార్యాలయాలను గుర్తించి వాటి నిర్మాణాలను చేపట్టేందుకు స్థల సేకరణ చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి మహేష్, ఎంపీడీవో జయరాం, తహసీల్దార్ అనంతరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ మహేశ్వర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో క్రమశిక్షణ కీలకం: సీఐ



మాట్లాడుతున్న సీఐ

చేర్యాల, ఆగస్టు 8: విద్యార్థి దశలో క్రమశిక్షణ కీలకమని, చదువుపై తప్ప ఇతర వ్యాపకాలపై దృష్టిసారించి జీవితం నాశనం చేసుకోవద్దని చేర్యాల సీఐ ఎల్. శ్రీను సూచించారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సైబర్‌నేరాలు, గంజాయి, ఇతరత్రా అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని ఉన్నతలక్ష్యంతో చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమణమూర్తి, హుస్నాబాద్ షీ టీమ్ బృందం సదయ్య, స్వప్న, ప్రశాంతి పాల్గొన్నారు.

'ఆక్రమించి తప్పుడు ప్రచారం'

గజ్వేల్, ఆగస్టు 8: గజ్వేల్ మండలం సింగాటంలో భూమిని ఆక్రమించి తమపైనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యేర్ల లక్ష్మారెడ్డి ఆరోపించారు. సింగాటంలోని సర్వే నెంబర్ 194, 195లో వంజరి నర్సింహులుకు చెందిన భూమి 3.38ఎకరాలు కాలువలో పోయిందని, పోయిన రికార్డును రెవెన్యూ రికార్డుల్లో నుంచి తొలగించకపోవడంతో అదే ఆసరాగా చేసుకుని తమ భూమిలోకి చొరబడుతున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా ఇటీవల తమపై దాడికి యత్నించి మూడు తులాల బంగారు గొలుసును అపహరించుకుపోయారని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదన్నారు.

విద్యార్థినికి జర్నలిస్టుల చేయూత

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 8: చదువుకోవాలన్న తపన ఉండి చదువుకునే అవకాశం లేని విద్యార్థినికి సిద్దిపేట అర్బన్ మండల జర్నలిస్టులతో పాటు సీనియర్ జర్నలిస్టులు సంజీవరెడ్డి, కత్తుల శ్రీనివాస్, రంగధాంపల్లి శ్రీనివాస్‌లు ఆర్థిక సహాయం అందజేసి హాస్టల్‌కు, చదువుకు కావలసిన సామగ్రిని గురువారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దౌల్తాబాద్ మండలానికి చెందిన ఐదోతరగతి చదువుతున్న మహేశ్వరి అనే విద్యార్థిని తల్లి చనిపోవడంతో పట్టించుకునే వారు కరువైపోయారు. కావలసిన సామగ్రిని అందజేసి ఎన్సాన్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థిని చేర్పించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సతీష్, ఉపాధ్యక్షుడు స్వామిగౌడ్, కార్యదర్శి అరుణ్ కుమార్, సహాయ కార్యదర్శి జైపాల్‌రెడ్డి, గౌరవ సలహాదారు రమేష్, కోశాధికారి సంతోష్, ఆఫీస్ ఇన్‌చార్జి శ్రీనివాస్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

మద్దూరు, ఆగస్టు 8: కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని కెజికెఎస్ జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ పిలుపునిచ్చారు. మద్దూరు మండలంలో గురువారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం మద్దూరులో ఎల్లమ్మ ఆలయ ఆవరణలో సంఘం మండల అధ్యక్షుడు పోతుగంటి లింగం అధ్యక్షతన ఏర్పాటు చేసిన అమరుల యాది సభలో మాట్లాడారు. గీత కార్మికుల కుటుంబాలందరికి రెండు లక్షల సబ్సిడి రుణాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు అనగోని నర్సింహులు, దూళిమిట్ట మండల అధ్యక్షుడు కోల సత్తయ్య, ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి కనకయ్య, బొమ్మగాని శివయ్య, బండి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

'పూసల కులస్థులకు చేయూతనివ్వాలి'



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకటేశం

కోహెడ, ఆగస్టు 8: సంచార జాతుల కులమైన పూసల కులానికి ప్రభుత్వం చేయూత అందించి ఆదుకోవాలని సిద్దిపేట జిల్లా పూసల సంఘం అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం కోరారు. గురువారం జిల్లా పూసల సంఘం కార్యవర్గ సమావేశం మండలంలోని తంగళ్లపల్లి వేణుగోపాలస్వామి ఆయల ఆవరణలో జిల్లా అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిరు వ్యాపారాలతో ఊరూరా, వాడవాడలా, వారసంతాలు, జాతరలలో తిరుగుతూ జీవించే స్థితిగతులను గమనించి పూసల కులస్థులకు ప్రత్యేక ప్యాకేజీతో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి తుపాకుల దుర్గేశం, జిల్లా కోశాధికారి గుంటిపల్లి నర్సింహులు, రాష్ట్ర కార్యదర్శి పులి రామకృష్ణ, రాష్ట్ర పదాధికారులు పన్నీరు నందం, గుంటిపల్లి సధాకర్ తదితరులున్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గాయాలు

మద్దూరు, ఆగస్టు 8: మద్దూరు మండలం సలాక్‌పూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు బాలగోని ఐలయ్య గురువారం తాటిచెట్టుపై నుంచి కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. రోజువారీలాగే తాటివనంలో చెట్టు ఎక్కుతుండగా, ప్రమాదవశాత్తు జారిపడటంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

అధ్వానంగా రోడ్లు

● **మరమ్మతు చేయాలని గ్రామస్థుల వేడుకోలు**

కొండపాక, ఆగస్టు 8: కొండపాకలో రోడ్డు వెడల్పులో భాగంగా చేపట్టిన రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీంతో రోడ్డు అంతా మురికి, బురద మయంగా తయారైంది. అధికారులకు నాయకులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు నిరసనకు దిగారు. గురువారం నీటి గుంతల్లో వరి నాటు వేసి నిరసన తెలిపారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రోడ్డు పనులు నిలిచిపోయి మూడుసంవత్సరాలు గడుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అంబటి బాలచందర్ గౌడ్, తుప్పుడు స్వామి, ఖైరోజు నర్సింహచారి, మంతెన నాగార్జున, మంచాల యాదగిరి, చెన్న రమేష్, హరీష్‌గౌడ్, తుపాకుల శేఖర్, మంచాల బాలకిషన్, మల్లేశం తదితరులున్నారు.

● **సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి నుంచి బొగ్గులోని బండకు వెళ్లే దారి బురదమయంగా మారింది. అంతకు ముందు ఉన్న తారు రోడ్డు తమ స్థలంలో నుంచి వేశారని కొంతమంది గ్రామస్థులు ఆరోపిస్తు దారికి కంప వేయడంతో పక్క నుంచి మట్టి పోసి దారి చేశారు. వర్షాలతో దారిపై గుంతలుగా ఏర్పడి అధ్వనంగా మారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● **హుస్నాబాద్‌రూరల్:** హుస్నాబాద్ మండలం మడద గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో ప్రధాన రహదారిపై బురద, నీటి గుంతలతో ప్రమాదకరంగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. 2010లో సీసీ రోడ్డు వేశారు. కానీ ప్రధాన రహదారి కావడం, తరచూ భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసమైంది. ఈ రోడ్డు మరమ్మతు కోసం మండల పరిషత్ నిధుల నుంచి రూ. 2 లక్షలు కేటాయించారు. కానీ ఆ పనులు పెండింగ్‌లో పడడంతో రోడ్డు మరింత అధ్వానంగా మారిందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ మడద సందర్శనలో భాగంగా రోడ్డుపై ఆరా తీశారు. రోడ్డు శాశ్వత పరిష్కారం కోసం అంచనా వేయాలని పంచాయతీ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. రూ. 10 లక్షల నిధుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు పంచాయతీ, ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.



హుస్నాబాద్ రూరల్: గుంతలతో బురదమయంగా మడద ప్రధాన రహదారి

సీపీఎస్‌ను రద్దు చేయాలి: పీఆర్‌టీయూ

మర్కుక్, ఆగస్టు 8: ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ మర్కుక్ మండల శాఖ అధ్యక్షుడు నారెడ్డి రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తుమ్మ కుమార్‌లు డిమాండ్ చేశారు. మండలంలో మర్కుక్, పాములపర్తి దామరకుంట, ఎర్రవల్లి, చేబర్తి, అంగడి కిష్టాపూర్, గణేష్‌పల్లి, నర్సన్నపేట, కర్కపట్ల, భవానందాపూర్, కాశిరెడ్డిపల్లి, పాతూర్ తదితర పాఠశాలలో గురువారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదును చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, నీరడి లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింహులు, షాబొద్దీన్, యాదగిరిరెడ్డి, సరితాదేవి తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

చేర్యాల/సిద్దిపేట టౌన్, ఆగస్టు 8: వయనాడ్ వరద బాధితుల సహాయార్థం సీపీఐ ఆధ్వర్యంలో గురువారం చేర్యాల పట్టణంలో విరాళాలు సేకరించారు. ఈసందర్భంగా పట్టణంలోని వ్యాపార, వర్తకదుకాణాలను ఆశ్రయించి విరాళాలు సేకరించిన అనంతరం పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ మాట్లాడారు. ప్రకృతి విపత్తు బాధితులకు చేయూతనందించడం సమష్టి బాధ్యతగా గుర్తించి సహాయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈరు భూమయ్య, జంగలి యాదగిరి, పొన్నబోయిన మమత, మల్లం అంజయ్య, గూడెపు సుదర్శన్, తిగుళ్ల కనకయ్య, గజ్జల సురేందర్, చేర్యాల స్వామిదాసు, బింగి పోశయ్య తదితరులు పాల్గొన్నారు. వయనాడ్ వరద బాధితులకు సిద్దిపేట పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు జాన్‌వెస్లీ నివాళులర్పిస్తూ బాధిత కుటుంబాలకు రూ. 50వేలు అందజేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. తన తల్లిదండ్రులు కుపిరాల మల్లయ్య, ఎల్లవ్వల జ్ఞాపకార్థం బాధిత కుటుంబాలకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధిత సొమ్మును ఆన్‌లైన్ ద్వారా చెల్లించినట్లు చెప్పారు.

ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ

గజ్వేల్, ఆగస్టు 8: గజ్వేల్ మండల పరిధిలోని అహ్మదీపూర్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని, హనుమాన్ యజ్ఞంలో పాల్గొన్నారు. ఆయనవెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు పాల రమేశ్ తదితరులున్నారు. గజ్వేల్ మండలం దాచారం గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ పెద్దమ్మ తల్లి ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

సీఈఐఆర్ ద్వారా ఫోన్ల రికవరీ

● **గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి**



ఫోన్లు అప్పగిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్/సిద్దిపేట క్రైం, ఆగస్టు 8: సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించడం సులభతరమైందని గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి అన్నారు. గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 15మంది ఫోన్లు పోగొట్టుకున్న వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వెంటనే సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి, ఫోన్లను గుర్తించి బ్లాక్ చేశామన్నారు. గుర్తించిన ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సెకండ్ హ్యాండ్ ఫోన్లు అమ్మితే కొనవద్దని సూచించారు. ఆయనవెంట గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా, అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు తదితరులున్నారు. సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 4 సెల్ ఫోన్‌లను సీఈఐఆర్ ద్వారా స్వాధీనం చేసుకుని బాధితులకు వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు అందజేశారు.

పండుగ సాయన్న జయంతి

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 8: హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం ప్రజావీరుడు (రాబిన్ హుడ్) జయంతి వేడుకలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేఏసీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, కొయ్యడ కొమురయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులున్నారు.

'ఆస్పత్రిపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం'

సిద్దిపేట అగ్రికల్చర్, ఆగస్టు 8: పీపుల్స్ ఆస్పత్రిపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తిరుపతి తెలిపారు. గురువారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చనిపోయిన వ్యక్తికి చికిత్స చేశారని, సిద్దిపేటలోని ఓ యూట్యూబ్ చానల్‌కు చెందిన వ్యక్తి ఆస్పత్రి యజమానికి వీడియో పంపి బ్లాక్ మెయిల్ చేయడానికి ప్రయత్నించాడని ఆరోపించారు. తాము స్పదించకపోవడంతో ఆ యూట్యూబ్ చానల్‌లో పీపుల్ ఆస్పత్రిలో ఠాగూర్ సీన్ రిపీట్ అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని డాక్టర్ కిషన్ తెలిపారు. చనిపోయిన వ్యక్తికి తాము చికిత్స చేశామనేది పూర్తి అవాస్తవమన్నారు. అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.